సాక్షి
నిర్మల్
సోమవారం । 2 । అక్టోబర్ । 2023



‘గిరి’జనానికి తీపి కబురు

ములుగు జిల్లాలో గిరిజన కేంద్రియ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని మోదీ ఆదివారం ప్రకటించారు. దీంతో గిరిజన వర్గాల్లో హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 8లో▸



సర్టిఫికెట్లు అందజేత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 50మంది విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించి అర్హులకు బెల్టులు, సర్టిఫికెట్లు ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, జాదవ్‌గణేశ్, రమణారావు, భూషణ్, రాజ్‌కుమార్, వంశీ, పూనమ్, హాసిని పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

‘చలో నిర్మల్’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గౌడసంఘం నాయకులు

భైంసాటౌన్: గౌడ కులస్తులకు దామాషా ప్రకారం రాజ్యాధికార వాటా ఇవ్వాలనే డిమాండ్‌తో చేపట్టనున్న ‘చలో నిర్మల్’ను విజయవంతం చేయాలని గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ధిరాములుగౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం భైంసాలోని సంఘ భవనంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 3న జిల్లా కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్‌హాల్‌లో మోకుదెబ్బ గౌడ జనగర్జన పేరిట రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభలకు రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, గౌడ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తరలిరానున్నట్లు తెలిపారు. నాయకులు గర్గుల మురళీగౌడ్, చేపూరి కనుకగౌడ్, ఆకుల శ్రీనివాస్‌గౌడ్, ఆకుల అంజయ్యగౌడ్, ముష్కం అశోక్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, అన్నాగౌడ్, ఆకు తిరుపతిగౌడ్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల పాదయాత్ర



ముథోల్: పాదయాత్రగా వెళ్తున్న దీక్షాపరులు

తానూరు: మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప గురుస్వాములు విఠల్, సుధాకర్ ఆదివారం తానూరు నుంచి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మహాలక్ష్మీ ఆలయంలో వారిని శాలువాలతో సన్మానించారు. నాయకులు పుండలిక్, మాధవ్‌రావ్‌పటేల్, సిద్ధు, గ్రామస్తులున్నారు.

అష్ట గ్రామం నుంచి..

ముథోల్: అష్ట గ్రామం నుంచి అయ్యప్ప దీక్షాపరులు పాదయాత్రగా శబరిమల సన్నిదానానికి బయలుదేరారు. గ్రామస్తులు వారిని ఘనంగా సాగనంపారు. సోమవారం బాసర నుంచి సుమారు 60 మంది భక్తులు పాదయాత్రలో పాల్గొననున్నట్లు దీక్షాపరులు తెలిపారు.

అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయొద్దు



‘టైగర్ రిజర్వ్’ లోగో వద్ద అటవీ అధికారులు

కడెం: అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయరాదని మండలంలోని ఉడుంపూర్ అటవీ రేంజ్ అధికారి ఎస్.శంకర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ‘ఐలవ్ కవ్వాల్ టైగర్ రిజర్వ్’ లోగో సమీపంలోని అటవీ ప్రాంతంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరివేశారు. డీఆర్వో ప్రకాశ్, రవి, ఉత్తమ్, శంకర్, లచ్చిరాం తదితరులున్నారు.

తొమ్మిదేళ్లలో రాష్ట్రానికి రూ.9లక్షల కోట్లు



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

కడెం: తొమ్మిదేళ్లలో ప్రధాని మోదీ రాష్ట్రానికి రూ.9లక్షల కోట్ల నిధులిచ్చారని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో నిర్వహించిన పార్టీ పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు కేటాయించిన ప్రధాని రాష్ట్రానికి వస్తే సీఎం కేసీఆర్‌కు వణుకు పుట్టిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరిపై రూ.లక్షన్నర అప్పు ఉందని, బంగారు తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో సీఎం కేసీఆర్ ఉన్నారని విమర్శించారు. నాయకులు కిష్టయ్య, రాజేందర్, రమేశ్ తదితరులున్నారు.

నేడు టీయూడబ్ల్యూజే ఆందోళన

నిర్మల్‌టౌన్: మీడియా రక్షణ, కమిషన్ చట్టాల ఏర్పాటు, అక్రిడిటేషన్ జర్నలిస్టులకు రైల్వే పాసులు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండూరి రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చి ఆందోళనలు విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధిలో భేష్!



సభలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్

ఆర్‌కేపీలో నిర్వహించిన బహిరంగసభకు హాజరైన జనం

- మంత్రుల నియోజకవర్గాలకు దీటుగా చెన్నూర్.. అంటూ కేటీఆర్ కితాబు
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌పై మంత్రి ప్రశంసలు
- మందమర్రి, రామకృష్ణాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- చెన్నూర్ ఎత్తిపోతలు, కొత్తగా రెవెన్యూ డివిజన్, రెండు మండలాలపై త్వరలోనే శుభవార్త
- రామకృష్ణాపూర్ సభలో ప్రకటన



బహిరంగసభ వేదికపై ప్రజాప్రతినిధులు, నాయకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాల్లో రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం పర్యటించారు. మంత్రి పర్యటన, సభ.. పార్టీ శ్రేణులతో పాటు ప్రజల్లో జోష్ నింపింది. రెండు మున్సిపాలిటీల పరిధిలో రూ.312 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సింగరేణి స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నీతానై సక్సెస్ చేశారు. కేటీఆర్ కూడా సుమన్‌పై ప్రశంసలు కురిపించారు. ఎమ్మెల్యేగానే తన నియోజకవర్గాన్ని మంత్రుల నియోజకవర్గం తరహాలో అభివృద్ధి చేస్తున్నారని కితాబిచ్చారు. మంత్రి అయితే అద్భుతాలు చేస్తాడని పేర్కొన్నారు.

స్వాగతం పలికిన అధికారులు..

మంత్రి కేటీఆర్ మందమర్రిలో హెలీక్యాప్టర్ దిగగానే కలెక్టర్ సంతోష్, అడిషనల్ కలెక్టర్ రాహుల్, సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ రామ్‌నాథ్ కేకన్, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్వాగతం పలికారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీలు పురాణం సతీశ్‌కుమార్, నారదాసు లక్ష్మణ్, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, కార్మిక నాయకుడు కెంగర్ల మల్లయ్య, స్థానిక మున్సిపల్ పాలక వర్గాలు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు హాజయ్యారు.

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

రామకృష్ణాపూర్ పట్టణంలో కేటీఆర్ వివిధ కార్యక్రమాల్లో బిజీబిజీగా గడిపారు. అభివృద్ధి పనులకు ప్రాంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మందమర్రి మండలం శంకర్‌పల్లి గ్రామ పంచాయతీలో రూ.500 కోట్లతో నిర్మించనున్న ఆయిల్ పాం ఫ్యాక్టరీకి ప్రభుత్వ విప్ సుమన్‌తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ప్రాణహిత కాలనీలోని కేసీఆర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్, సమ్మక్క–సారలమ్మ మహిళా భవన్, బతుకమ్మ గ్రౌండ్, డబుల్ బెడ్ రూం ఇళ్లు, సెంట్రల్ లైటింగ్, అర్బన్ మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పనులు ప్రారంభించారు. అనంతరం బొక్కలగుట్ట గాంధారివనంలో కేసీఆర్ అర్బన్‌పార్క్‌కు భూమిపూజ చేశారు. రూ.50 కోట్ల నిధులతో 250 ఎకరాల్లో పార్కు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. అక్కడి నుంచి క్యాతనపల్లి ఆర్వోబీ పనులు పరిశీలించి రామకృష్ణాపూర్ పట్టణానికి చేరుకున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో రూ.15.16 కోట్లతో నిర్మించిన 286 డబుల్ బెడ్ రూం ఇళ్లను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. అంగడిబజార్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను పరిశీలించారు.

హామీలతో ఆశలు

ఎమ్మెల్యే సుమన్ చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్, చెన్నూరు మండలంలోని గోదావరి తీర గ్రామాలతో కలిపి ఆస్నాద్, కోటపల్లి మండలం, ప్రాణహిత తీర గ్రామాలను కలిపి పారుపల్లి మండలం ఏర్పాటు చేయాలని కోరడంతో మంత్రి తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే సీఎం కేసీఆర్ నోట చెన్నూర్ ఎత్తిపోతలు ప్రారంభంపై శుభవార్త వింటారని చెప్పారు. ఈ ప్రాంతానికి సాగునీరు ఇచ్చి సస్యశ్యామలం చేస్తామన్నారు. రామకృష్ణాపూర్ పట్టణం, క్యాతనపల్లి ఆర్వోబీకి నిధుల విడుదలలో జాప్యంతో కాంట్రాక్టర్ పనిచేయడం లేదని, జాప్యం జరగకుండా చూడాలని విప్ కోరారు.

సుమన్‌కు ప్రమోషన్..

చెన్నూర్ నియోజకవర్గాన్ని గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల తరహాలో అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంత్రి కితాబిచ్చారు. 60 ఏళ్లలో జరగని అభివృద్ధి పదేళ్లలో చేసి చూపించారన్నారు. వచ్చే ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపిస్తే సీఎం కేసీఆర్ ప్రమోషన్ ఇస్తారని కేటీఆర్ ప్రకటించారు. ఎమ్మెల్యేగానే ఇంత అభివృద్ధి చేశారని, ప్రమోషన్ వస్తే ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలని రామకృష్ణాపూర్ సభలో ప్రజలకు సూచించారు.

భారీ బందోబస్తు..

మంత్రి కేటీఆర్ పర్యటనలో అడుగడుగునా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటించిన రోడ్డు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మరోవైపు శనివారం రాత్రి నుంచి బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, వామపక్ష, విద్యార్థి సంఘాల నాయకుల్ని పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

మిస్సింగ్ ఏరియాలకు త్వరలో పట్టాలు : విప్ సుమన్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాల్క సుమన్

సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి తమ ప్రభుత్వ హయాంలో పట్టాలు పంపిణీ చేస్తున్నామని, అయితే రామకృష్ణాపూర్ పట్టణంలో మిస్సయిన కొన్ని ఏరియాలకు కూడా త్వరలో పంపిణీ చేస్తామని విప్ సుమన్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. క్యాతనపల్లి ఆర్వోబీ పనులకు సంబంధించి కొన్ని నిధులు పెండింగ్‌లో ఉండడంతో పూర్తికావడం లేదని, మంత్రి ఈ విషయంలో చొరవ తీసుకుని నిధులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. రామకృష్ణాపూర్ ప్రాంతం ఒకప్పుడు గనులు, కార్మికులతో కళకళలాడేదని, గనులు మూతపడడంతో ఈ ప్రాంతం నుంచి ప్రజలు వలస వెళ్తున్నారని సుమన్ తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలని కేటీఆర్‌కు విన్నవించారు.

పిట్ట కథలతో కాంగ్రెస్‌పై విమర్శలు

బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా రెండు పిట్ట కథలు చెప్పారు. ‘17 ఏళ్ల బాలుడు చెడు వ్యసనాలకు బానిసై కన్న తండ్రి జేబులో డబ్బు దొంగిలించబోయాడు. అడ్డొచ్చిన అమ్మానాన్నలను చంపి జడ్జి ముందు నేను అనాథను అని శిక్ష తప్పించుకున్నాడు’.. 135 ఏళ్ల ముసలామెతో కాంగ్రెస్ పార్టీని పోలుస్తూ సూది పోతే పెద్ద మొక్కులు కోరడంలాంటి కథలు వినిపించారు.

టెంట్లు లేక ప్రజల ఇక్కట్లు...

మంత్రి పర్యటన సందర్భంగా రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో నిర్వహించిన బహిరంగసభకు హాజరైన ప్రజలు కొంత అసహనానికి గురయ్యారు. సభా ప్రాంగణంలో వేలసంఖ్యలో కుర్చీలు వేసినప్పటికీ నీడ కోసం ఒక్కటెంట్ కూడా వేయలేదు. మిట్ట మధ్యాహ్నం సభ నిర్వహించడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కపోతకు తట్టుకోలేక జనం అసంతృప్తికి గురయ్యారు. కొంతమంది బాహాటంగానే విమర్శలు చేశారు. కనీసం మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో పలువురు సభ జరుగుతుండగానే బయటకు వెళ్లడం కనిపించింది. పరిస్థితి గమనించిన మంత్రి కేటీఆర్ ‘ఎండలో మిమ్మల్ని ఇబ్బంది పెట్టను’ అంటూ 20 నిమిషాల్లోనే ప్రసంగం ముగించారు. అయితే అప్పటికే పలువురు మహిళలు వేడి, ఉక్కపోతతో సొమ్మసిల్లి పడిపోవడంతో వారిని అక్కడి నుంచి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు.

‘గులాబీ’ గాజులు చల్లి నిరసన



కాంగ్రెస్ నాయకులు తెచ్చిన గులాబీ రంగు గాజులు

చెన్నూర్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం లేదని.. ఇది ఎమ్మెల్యే బాల్క సుమన్ చేతగానితనమే.. అంటూ కాంగ్రెస్ నాయకురాలు రామిళ్ల రాధిక ఆదేశాలతో మహిళా కార్యకర్తలు ఠాగూర్ స్టేడియంలో పలుచోట్ల గులాబీరంగు గాజులు చల్లి నిరసన తెలిపారు. అక్కడున్న పోలీసులు గుర్తించి విడిగా కవరులో తెచ్చిన వాటిని అడ్డుకున్నారు. అయితే కొందరు మహిళలు గులాబీ గాజులు చేతులకు వేసుకుని వచ్చి సభలో పలు చోట్ల పారబోశారు.

మందమర్రిలో రోడ్‌షో...



మార్కెట్ సెంటర్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

మందమర్రిరూరల్: కేటీఆర్ పర్యటనలో భాగంగా మందమర్రిలో ఎమ్మెల్యే సుమన్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. తర్వాత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. సింగరేణి ఉద్యోగుల భవిష్యత్ కోసం కేసీఆర్ ఆలోచిస్తే కాంగ్రెస్, బీజేపీ సింగరేణికి నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్ ఆధ్వర్యంలో సింగరేణిలో అనేక హక్కులు సాధించుకున్నామన్నారు. డిస్మిస్ కార్మికులకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. లాభాల బోనస్ 32 శాతం, దీపావళి బోనస్ రూ.వెయ్యి కోట్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే మందమర్రి మున్సిపాలిటీలో ఎన్నికలు జరగడం లేదని విమర్శించారు.

జిల్లాకూ ‘పసుపు’ మేలే..

- ప్రధాని ప్రకటనపై రైతుల హర్షం
- ఇందూరులో బోర్డు అనుకూలమే
- జిల్లాలో పెరగనున్న సాగు విస్తీర్ణం



నిర్మల్: తెలంగాణకు పసుపుబోర్డు ఇస్తున్నట్లు ఆదివారం పాలమూరు సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించడంపై జిల్లా రైతులు హర్షం వ్యక్తంజేస్తున్నారు. పక్కనే ఉన్న నిజామాబాద్ జిల్లాలోనే ఈ బోర్డు ఏర్పాటు కానుండటంతో సంబురపడుతున్నారు. జిల్లాలోని నిర్మల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు లోకేశ్వరం, కుంటాల, తానూరు, ఖానాపూర్‌లోనూ కొంత పసుపు సాగవుతోంది. పండించిన పసుపును అమ్ముకునేందుకు ఇప్పటికీ జిల్లా రైతులు ఇందూరుబాట పడుతున్నారు. ఇప్పుడే అదే నిజామాబాద్‌లో పసుపుపంటకు ఏకంగా బోర్డే ఏర్పాటు కానుంది. దీని ప్రభావం జిల్లాలో పసిడిపంటగా పిలిచే పసుపు సాగుపైనా చూపనుంది. సాగు విస్తీర్ణం పెరగనుంది.

పెరగనున్న సాగు విస్తీర్ణం

జిల్లావ్యాప్తంగా దాదాపు 20వేల ఎకరాల్లో పసుపు సాగుచేస్తుంటారు. ఇటీవల కొన్నేళ్లుగా పంటకు ధర తగ్గడం, పెరగడంతో 10–15ఎకరాల మధ్య సాగు నమోదవుతోంది. పసుపుబోర్డు ఏర్పాటు, మద్దతు ధరల ప్రకటన, అనువైన మార్కెట్లతో ముందుముందు పసిడి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఎక్కువగా మామడ, లక్ష్మణచాంద, సోన్, నిర్మల్‌రూరల్, దిలావర్‌పూర్ మండలాల రైతులు పసుపు సాగు చేస్తున్నారు. అలాగే సారంగపూర్, లోకేశ్వరం, తానూరు, కుంటాల, ఖానాపూర్ మండలాల్లోనూ కొంతమేర పసుపు సాగవుతోంది. ప్రధానంగా నిర్మల్ నియోజకవర్గంలోని భూములు పసుపు సాగుకు అనుకూలంగా ఉన్నాయి.

అమ్ముకునేందుకు అక్కడికే..

పండించిన పసుపును జిల్లా రైతులు అధికశాతం నిజామాబాద్ మార్కెట్‌యార్డుకే తీసుకెళ్తారు. నిర్మల్ నుంచి కేవలం 75కిలో మీటర్ల దూరం ఉండటం, రవాణాసౌకర్యం అందుబాటులో ఉండటంతో అక్కడికే తీసుకువెళ్తున్నారు. మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో ధర బాగా పలికినా దూరభారం ఎక్కువగా ఉండటంతో రైతులు నిజామాబాద్‌కు వెళ్లేందుకే మొగ్గుచూపుతున్నారు. ఇప్పుడు అదే ఇందూరులో ఏళ్లుగా రైతుల్లో ఆశలు రేపుతున్న పసుపు బోర్డు ఎట్టకేలకు ఏర్పాటు కానుంది. దీంతో తమ పంటకు డిమాండ్, ధర పెరుగుతాయని జిల్లాలోని పసుపు రైతులు ఆశిస్తున్నారు.

హర్షణీయం



ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి పసుపు బోర్డు ప్రకటించడం సంతోషకరమైన విషయం. పసుపు సాగు చేసే రైతుల్లో ఇప్పటికైనా భరోసా నింపారు. పసుపు రైతులకు మేలు జరగనుంది.

– నర్సారెడ్డి, లక్ష్మణచాంద

డిమాండ్ నెరవేరనుంది



నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. ఇప్పటికైనా కేంద్రం సానుకూలంగా స్పందించింది. ప్రధాని మోదీ బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయం.

– మధుసూదన్‌రెడ్డి, సిద్ధిలకుంట, సోన్ మండలం

ధర పెంచి ఆదుకోవాలి



పసుపుబోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని మోదీ చెప్పడం సంతోషమనిపించింది. తొమ్మిదినెలల పాటు కష్టపడి పండించే పసుపు పంటకు గిట్టుబాటు ధర కూడా కల్పించి ఆదుకోవాలి.

– రాజన్న, కంజర్, లక్ష్మణచాంద మండలం

సాగు పెరగనుంది



ప్రధాని మోదీ పసుపుబోర్డు ప్రకటన చేయడం హర్షణీయం. ఇది సంతోషకరమైన విషయం. ఇప్పటికీ పసుపు పంట అమ్మకానికి నిజామాబాద్‌కు వెళ్తున్నం. అది పక్కనే ఉండటంతో సాగు కూడా పెరుగుతుంది.

– నర్సారెడ్డి, పొన్కల్, మామడ మండలం

‘గాంధీజీ కలలు నెరవేరుద్దాం’



రోడ్డు శుభ్రం చేస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అధికారులు

నిర్మల్‌టౌన్: గాంధీజీ కన్న కలలు నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని శ్యామ్‌ఘడ్ కోట వద్ద స్వచ్ఛత హీ సేవలో భాగంగా ‘ఏక్ దిన్ ఏక్ గంట’ కార్యక్రమంలో ఆదివారం కలెక్టర్ పాల్గొన్నారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిసరాలు శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శ్రమదానం, ఇంకుడు గుంతలు, ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ కిశోర్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో..

జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టు ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించారు. సీనియర్ సివిల్ జడ్జి అజేశ్ కుమార్, న్యాయవాదులు, సిబ్బంది ఉన్నారు.

నిర్మల్ బస్టాండ్‌లో..

దీక్ష జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్మల్ బస్టాండ్ ఆవరణను శుభ్రం చేశారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, స్టేషన్ మేనేజర్, నారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘యువతను ఆదుకోవడంలో విఫలం’



మౌనం పాటిస్తున్న నాయకులు

ఖానాపూర్: యువతను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రదీప్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన పీవైఎల్ జిల్లా రెండో మహాసభకు హాజరై మాట్లాడారు. యువత పోరాటాల్లో ముందుండి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వాలు యువతను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంజేశారు. ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, ఆత్మస్థైర్యంతో పోరాడి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మౌనం పాటించి ఆత్మహత్యలకు పాల్పడ్డ వారికి సంతాపం తెలిపారు. సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, నాయకులు పెండూర్ మోహన్, సుందర్, శంభు, భీంరావు, మల్లికార్జున్, గణేశ్, అంకుశ్‌రావు, సోనెరావు, రాజన్న, ఎల్లయ్య ఉన్నారు.

వాలీబాల్ ఎంపిక పోటీలు

నిర్మల్‌టౌన్: స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో అండర్–17 జిల్లా వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. 50 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైనవారు జోనల్ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని ఎస్జీఎఫ్ సెక్రటరీ రమణారావు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ వన్నెల భూమన్న తదితరులున్నారు.

క్లుప్తంగా

లక్ష్మీదేవి అమ్మవారి వాహనం ప్రత్యక్షం



తెల్ల గుడ్లగూబ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం ముఖ ద్వారం వద్ద గల లక్ష్మీదేవి విగ్రహాల వద్ద ఆమె వాహనమైన తెల్ల గుడ్లగూబ శనివారం రాత్రి ప్రత్యక్షమైంది. సాయంత్రం వేళలో పూజకు వచ్చిన భక్తులు ఆ గుడ్లగూబని చూసి ఆలయం మహిమను తెలుసుకున్నారు. గుడ్లగూబ అమ్మవారి వాహనం కావడానికి గల కారణాలను ఆలయ పూజారులు భక్తులకు వివరించారు. ఆలయ ప్రాంగణమంతా ఓం నమో వెంకటేశాయ అంటూ.. గోవింద నామస్మరణతో మార్మోగింది.

మోదీ సభ సక్సెస్ చేయాలి

ఖానాపూర్: ఈ నెల 3వ తేదీన నిజామాబాద్‌లో తలపెట్టిన ప్రధాని నరేంద్రమోదీ భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కోరారు. ఆదివారం మండలంలోని ఎర్వచింతల్, బీర్నంది తదితర పంచాయతీల్లో ద్విచక్రవాహనంపై పర్యటించారు. బహిరంగసభకు రావాలని ప్రచారం చేశారు. అలాగే బాధిత కుటుంబాలను పరామర్శించారు. నాయకులు ప్రకాశ్, రవి, శేఖర్, రాజేశ్, శ్రీనివాస్, రాజశేఖర్, ప్రవీణ్, చింటు, గంగన్న తదితరులున్నారు.

రా రైస్‌మిల్లర్స్ కార్యవర్గం



జిల్లా రారైస్ మిల్లర్స్ కార్యవర్గ సభ్యులు

నర్సాపూర్(జీ): మండల కేంద్రంలోని గురడి రెడ్డి కాపు సంఘ భవనంలో ఆదివారం రా రైస్ మిల్లర్స్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సట్లవర్ మహేశ్, ఉపాధ్యక్షుడిగా హరీశ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా కోస్లి వెంకట్రావు, జాయింట్ సెక్రటరీలుగా సిరిమల్లె మహేశ్, రాథోడ్ నరేందర్, లీగల్ అడ్వైజర్‌గా తూర్పాటి వెంకటేశ్, అడ్వైజర్‌గా సతీశ్‌రావు, ట్రెజరర్‌గా నాంపల్లి రాము, కార్యవర్గ సభ్యులుగా సురేశ్‌యాదవ్, బచువార్ మహేశ్, సందీప్, అనిశ్‌రెడ్డి, చిన్నయ్య ఎన్నికయ్యారు.

రగ్బీ అసోసియేషన్ కార్యవర్గం

నిర్మల్‌టౌన్: రగ్బీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మార జీవన్‌రెడ్డి, కార్యదర్శిగా భూమేశ్, కోశాధికారిగా భూమన్న, ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్, జాయింట్ సెక్రటరీగా బుచ్చి రామారావు ఎన్నికయ్యారు. వ్యాయా మ ఉపాధ్యాయులు భోజన్న, రమణారావు, అన్నపూర్ణ ఉన్నారు.

గిరిజనానికి తీపికబురు

- నెరవేరనున్న యూనివర్సిటీ కల
- ములుగు జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటుపై ప్రకటన
- పోరాటం ఫలించిందంటున్న గిరి సంఘాల ప్రతినిధులు
- ఉమ్మడి జిల్లాకు అన్యాయమంటూ ఆవేదన

ఏళ్లుగా గిరిజనుల ఉన్నత విద్య కోసం యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు కోరుతున్నారు. ఎట్టకేలకు మహబూబ్‌నగర్ జిల్లాలో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో ములుగు జిల్లాలో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని భారత ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ప్రకటించడం, ఈ యూనివర్సిటీకి ఆదివాసీ దేవతలైన సమ్మక్క – సారక్క పేరు పెడుతామని, రూ.900 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడంపై ఆదివాసీ గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుపై ఉమ్మడి జిల్లాలోని పలువురు గిరిజన, ఆదివాసీల ప్రజాప్రతినిధులు, విద్యావంతుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...



నాగోబా దర్బార్ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు(ఫైల్)

ఆదిలాబాద్‌కు అన్యాయం...



ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన యూనివర్సిటీ మంజూరు చేయడం సంతోషకారంగా ఉంది. ఆదిలాబాద్‌లోని ఉట్నూర్‌లో మంజూరైన గిరిజన యూనివర్సిటీని ములుగులోకి తీసుకెళ్లి ఏర్పాటు చేయడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీలకు అన్యాయం జరిగింది. – కోట్నాక విజయ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు

ములుగుకు మార్చడం బాధాకరం..



ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్‌లో 70శాతం ఆదివాసీలు ఉన్న జిల్లాలోని ఉట్నూర్‌కు మంజూరైన యూనివర్సిటీని ములుగుకు కేటాయించడం బాధాకరం. ఉమ్మడి జిల్లాలో ఒక్క యూనివర్సిటీ కూడా లేదు. ఉట్నూర్‌లో ఏర్పా టు చేస్తే ఇక్కడి విద్యార్థులకు న్యాయం జరిగేది. –కైలాస్, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు, ఆసిఫాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కేటాయిస్తే బాగుండేది



నిర్మల్‌ఖిల్లా: ప్రధాని నరేంద్ర మోదీ ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడం స్వాగతిస్తున్నాం. ఈ గిరిజన యూనివర్సిటీని అత్యధిక గిరిజన, ఆదివాసీ జనాభా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు, ఇచ్చోడ వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే మరింత బాగుండేది. ఈ యూనివర్సిటీలో సంప్రదాయ కోర్సులతో పాటు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే నూతన సాంకేతిక కోర్సులను ప్రవేశపెడితే గిరిజన విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. – రాజేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శి, జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, నిర్మల్

ఓట్ల కోసమే యూనివర్సిటీ ఏర్పాటు ప్రకటన



ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీ అందుబాటులో లేక జిల్లాలోని చాలా మంది ఆదివాసీలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. జిల్లాలో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని గతంలో అనేక ఉద్యమాలు చేశాం. ప్రభుత్వం ఆలస్యంగా స్పందించింది. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆదివాసీల ఓట్లు రాబట్టుకోవడానికి ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేశారు. – దుర్వ నగేష్, ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు

ఉమ్మడి జిల్లాలోనే ఏర్పాటు చేయాలి

కడెం: గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు ప్రకటన సంతోషకరమైన విషయం. గిరిజనులు గత కొన్ని సంవత్సరాలుగా యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎదురుచూశారు. వారి చిరకాల కోరిక ప్రధాని నరేంద్ర మోదీ నెరవేర్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ అక్షరంలో ముందుంది. అక్షరాభ్యాసంలో కూడా ముందుకు రావాలంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే మంచిదని మా వాదన. – రాజేందర్ హపావత్, ఉమ్మడి జిల్లా ఎల్‌హెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి

యూనివర్సిటీ ఏర్పాటుపై జీవో విడుదల చేయాలి



ఖానాపూర్: గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ చేసిన ప్రకటనలకే పరిమితం కాకుండా అధికారికంగా జీవో విడుదల చేయాలి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన ఉట్నూర్‌లో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. గతంలోనే యూనివర్సిటీకి కావాల్సిన స్థలాన్ని ఉట్నూర్‌లో సేకరించారు. – అజ్మీరా రేఖానాయక్, ఎమ్మెల్యే, ఖానాపూర్

కేంద్రానికి గిరిజనుల విద్యపై చిత్తశుద్ధి లేదు



ఆదిలాబాద్‌రూరల్: గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలని కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎప్పుడో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసేది. ఎన్నికల్లో గిరిజనుల ఓట్లు దండుకునేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇది బూటకపు హామీ మాత్రమే. – కుమ్ర రాజు, కుమురం సూరు యువ సేన జిల్లా అధ్యక్షుడు

ఏళ్ల నాటి కల నెరవేరింది



పాతమంచిర్యాల: యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు మోదీ ప్రకటించడం హర్షదాయకం. తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఏళ్లుగా ఎదురుచూశాం. ఎట్టకేలకు కల నెరవేరింది. గిరిజనులకు ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుంది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లలేనివారికి ఇది మంచి అవకాశం. గిరిజన నిరుపేద విద్యార్థులకు ఇది సువర్ణ అవకాశం. ఏళ్లనాటి కల నెరవేరింది. – ఎర్మ పున్నం, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

విద్యావకాశాలు పుష్కలం



నిర్మల్‌ఖిల్లా: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లాలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రకటించడం హర్షణీయం.రూ 900 కోట్లతో ఏర్పాటు చేయబోయే యూనివర్సిటీతో గిరిజన విద్యార్థులకు విద్యా అవకాశాలు మరింత మెరుగుపడతాయి.. రాష్ట్రంలోని గిరిజన ఆదివాసి బిడ్డలు ఉన్నత విద్య అందుబాటులోకి రానుంది. – భూక్య జానూబాయి, జెడ్పీటీసీ, పెంబి

ఆనందంగా ఉంది



నార్నూర్: ఏళ్లుగా యూనివర్శిటీ ఏర్పాటు కోసం ఆదివాసీ గిరిజనులు పోరాటం చేస్తున్నారు. పోరాటాన్ని గుర్తించిన ప్రధాని సమక్క సారక్క పేరుతో గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేస్తూ ప్రకటన చేయడం ఆనందంగా ఉంది. నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పడం ఆదివాసీ గిరిజనుల్లో మనోధైర్యాన్ని కలిగిస్తోంది. – మెస్రం గంగుబాయి సోము, జెడ్పీటీసీ, గాదిగూడ

భీం పురిటిగడ్డలో ఏర్పాటు చేస్తే బాగుండేది



నార్నూర్: ఆదివాసీ గిరిజనులు ఆరాధ్యుడు తెలంగాణలోనే వెనుకబడిన ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేస్తే బాగుండేది. అయినప్పటికీ ఆదివాసీ గిరిజనుల పోరాటాన్ని అర్థం చేసుకుని ప్రధానమంత్రి గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు ప్రకటనను స్వాగతిస్తున్నాం. – దాదిరావు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

జిల్లా 'గిరి' విద్యార్థులకు తీరని అన్యాయం



ఉట్నూర్‌రూరల్: గిరిజన యూనివర్సిటీ ఇతర ప్రాంతానికి తరలించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న గిరిజన విద్యార్థులకు తీరని నష్టం. 15–20 ఏళ్ల నుంచి గిరిజన యూనివర్సిటీ కోసం పోరాడుతుంటే ఇతర జిల్లాలో ఏర్పాటు చేయడం సమంజసం కాదు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు మరింతగా అన్యాయం చేశారు. ఉన్నత చదువులకు స్థానికంగా వసతులు లేక ఇక్కడి విద్యార్థులు వెనుకబడి పోతున్నారు. – పుర్క బాపురావు, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి

పోరాటాల ఫలితమే..



కౌటాల: ఆదివాసీల సంఘాల ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితామే గిరిజన యూనివర్సిటీ. ఉమ్మడి ఆదిలాబాద్‌లో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాం. యూనివర్సిటీ ప్రకటించిన ప్రధానికి ప్రత్యేక కృతజ్ఞతలు. – మెర్పల్లి సదాశివ్, మన్నెవార్ సేవా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, కౌటాల

జిల్లా చేజారిన గిరిజన యూనివర్శిటీ

బోథ్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజనుల ఆశలు ఆవిరయ్యాయి. ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తారని అనుకున్న సమయంలో ప్రధాని మోదీ ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో జిల్లాకు గిరిజన యూనివర్శిటీ చేజారింది. ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు ఉద్యమం చేశారు. దీంతో తెలంగాణకు గిరిజన యూనివర్శిటీ వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నా, అదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయకపోవడంపై ఇక్కడి గిరిజనులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనువైన ప్రాంతంగా ఉన్న ఉట్నూర్‌లో గిరిజన యూనివర్శిటీని ఏర్పాటు చేయకుండా ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేయడంపై పెదవి విరుస్తున్నారు. గిరిజనులు అధికంగా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను విస్మరించడంపై ఇక్కడి గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఉట్నూర్‌లో ఏర్పాటుకు సన్నాహాలు

2008లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. 2011లో ఆగస్టు 27న అదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు జీవో నంబరు 783 జారీ చేసింది. దీంతో జిల్లా అధికారులు, ఐటీడీఏ అధికారులు ఉట్నూర్‌లో 470తో పాటు మరో 300 ఎకరాల పోరంబోకు భూమిని గుర్తించారు. భూమితో పాటు సానుకూల అంశాలను పొందుపర్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించారు. దీంతో ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటవుతోందని ఇక్కడి గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో తెలంగాణలో గిరిజన యూనివర్శిటీని ఏర్పాటు చేస్తున్నట్లు బిల్లులో పదకొండో అంశంలో ప్రస్తావించారు. అప్పటి నుంచి త్వరితగతిన గిరిజన యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు పలుమార్లు ఆందోళన నిర్వహించారు. కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చలనం లేదు.

ములుగులో ఏర్పాటుకు ఆదేశాలు

ఈ క్రమంలో 2018లో అప్పటి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ములుగులో గిరిజన యూవర్శిటీని ఏర్పాటు చేసేందుకు అధికారులు భూమిని గుర్తించాలని ఆదేశించారు. గిరిజన యూనివర్శిటీకి అనువైన ప్రాంతంగా ఉన్న ఉట్నూర్‌లో కాకుండా ములుగులో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటంతో ఇక్కడి ప్రజలు తీవ్రస్థాయిలో ఉద్యమాన్ని చేపట్టారు. ములుగు జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయానికి భూమిని సైతం అప్పట్లోనే గుర్తించారు. కేంద్రానికి సైతం నివేదించారు. అప్పటి నుంచి ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థులు, పలు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేశారు. అయినా ఫలితం లేదు. ప్రధాని మోదీ మహబూబ్‌నగర్ సభలో ములుగు జిల్లాలో సమ్మక్క సారక్క పేరుతో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గిరిజనులు తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపినా, ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయకపోవడంపై నిరాశ చెందుతున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

జవాన్ వేధింపులతో యువతి ఆత్మహత్య



కడవేని శిరీష(ఫైల్)

బజార్‌హత్నూర్: ఆర్మీ జవాన్ పెళ్లి చేసుకోవాలని వేధించడంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పిప్రి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై బి.నరేశ్ వివరాల ప్రకారం... పిప్రి గ్రామానికి చెందిన కడవేని శ్రీనివాస్, సత్యమ్మల చిన్న కూతురు శిరీష (23) డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి ఆర్మీ జవాన్ మేకల నరేష్ ఏడు నెలలుగా పెళ్లి చేసుకోవాలని ఫోన్‌లో శిరీషను వేధిస్తున్నాడు. ఇదే విషయం కుటుంబ సభ్యులకు తెలుపడంతో నరేష్‌ను ఆమె సోదరుడు సతీష్ మందలించాడు. అయినా వేధింపులు ఎక్కువకావడంతో తన ఫోన్ నంబర్ మార్చింది. గత వారం సెలువుపై గ్రామానికి వచ్చిన నరేష్ ఆమె కొత్త ఫోన్ నంబర్‌కు శనివారం రాత్రి మళ్లీ ఫోన్ చేసి పెళ్లి చేసుకోవాలని వేధించాడు. ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని యువతి..

ఉట్నూర్‌రూరల్: సెల్‌ఫోన్ కొనివ్వలేదని మనస్తాపంతో యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది.. ఏఎస్సై దిలీప్‌కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని అందోలి గ్రామానికి చెందిన గాయక్‌వాడ్ దయానంద్, రంజనలకు ముగ్గురు సంతానం. వారిలో పెద్ద కూతురు గాయక్‌వాడ్ సంజన(17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆదివారం తల్లి రంజనను కూతురు తనకు సెల్‌ఫోన్ కొనివ్వాలని కోరింది. డబ్బులు లేవని పత్తి పంట వచ్చిన తర్వాత కొనిస్తానని తెలిపి పనులకు వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుంది. కొంత సేపటికి సంజన్ తమ్ముడు ఇంటికి రాగా తలుపులు ఎంతకీ తీయకపోవడంతోకీ ఆ విషయాన్ని తల్లికి తెలిపాడు. తల్లి ఇంటికి చేరుకొని స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు ఇంటి పైకప్పు తీసి చూడగా ఉరేసుకుని కనిపించింది. కొన ఊపిరితో ఉన్న సంజనను ఇంద్రవెల్లి ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి..

తలమడుగు: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం... లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆత్రం జంగు(30) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఆదివారం పురుగుల మందు తాగి ఇంటి ఎదుట పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

వివాహితపై లైంగికదాడి

- ప్రస్తుతం ఆమె నాలుగు నెలల గర్భవతి

ఆదిలాబాద్‌రూరల్: వివాహితపై నలుగురు లైంగికదాడికి పాల్పడిన ఘటన మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై విష్ణువర్ధన్ తెలి పిన వివరాల ప్రకారం.. మావల గ్రామంలో నివాసం ఉంటున్న వివాహితకు 2014 లో మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. ఈ క్రమంలో వారికి ముగ్గురు సంతానం అయ్యారు. భర్త మూడేళ్ల క్రితం ఆమెను వదిలి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కూలీ పనులు చేసుకుంటూ ఆమె పిల్లలతో పాటు తల్లి, సోదరుడితో కలిసి మావల గ్రామంలో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆమెకు మాయ మాటలు చెప్పి వేర్వేరు సందర్భాల్లో కొద్ది రోజులుగా లోబర్చుకున్నారు. ప్రస్తుతం ఆమె 4 నెలల గర్భిణి కావడంతో విషయం బయటపడింది. దీంతో ఆమె శనివారం పోలీసులకు తనపై కొంతకాలంగా నలుగురు వేర్వేరుగా లైంగికదాడికి పాల్పడినట్లు ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి కేసు నమోదైంది. ఆమెను లోబరుచుకున్న నలుగురు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. త్వరలో వారిని పట్టుకుంటామని ఎస్సై వెల్లడించారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి

భైంసా: బాసర వద్ద గోదావరిలో మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సంతోశ్ (18) స్నేహితులతో కలిసి బాసరలోని అమ్మవారి దర్శనానికి వచ్చాడు. అందరు కలిసి మొదటి స్నానఘట్టాల వద్దకు చేరుకుని గోదావరిలో స్నానం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు సంతోశ్ గల్లంతయ్యాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరినవారితో శ్రీహరిరావు

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి గ్రామానికి చెందిన బైరి శంకర్, బైరి గంగాధర్, బైరి కార్తీక్, ఓసా బన్నీ, ప్రవీణ్, భూమన్న, శంకర్ తదితరులు ఆదివారంకాంగ్రెస్ నాయకుడు ఈటల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలో వీరికి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, పార్‌పెల్లి మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, సమ్మెట రవి వినేశ్ తదితరులున్నారు.

రసాయనాల డబ్బా పేలి యువతికి గాయాలు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో ఆదివారం రసాయనాల డబ్బా పేలి ఓ యువతి తీవ్రంగా గాయపడింది. స్థా నికుల కథనం.... ప్రకారం రాజస్థాన్ రాష్ట్రాని కి చెందిన కొందరు కళాకారులు మంజులా పూర్ శివారులో గుడారాలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. మౌర్య అనే యువతి ఆదివా రం సాయంత్రం తమ గుడారంలోని ఖాళీ డబ్బాలు, ఇతర పనికిరాని వస్తువులను బయట పడేసింది. అప్పటికే అక్కడ కాలుతున్న చెత్తతో ఆ డబ్బాల్లోని రసాయనాలు కలిసి పేలడంతో యువతికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాపత్రికి, ఆపై మెరుగైన వైద్యానికి నిజామాబాద్‌కు తరలించారు. సదరు యువతి వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలోనే ఇలా కావడంతో కుటుంబీకుల్లో ఆందోళన నెలకొంది.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మిలాద్ ఉన్ నబీ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పట్టణ వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఇసాక్ అలీ, ముస్తఫా, రసూల్, అజాం, అన్వర్, మసూద్, అధికసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

మృతదేహం గుర్తింపు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని భీంసరి వాగులో గత నెల 26న లభించిన గుర్తు తెలి యని మృతదేహం ఆచూకీని కుటుంబ సభ్యులు ఆదివారం గుర్తించారని ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... పట్ట ణంలోని వడ్డెర కాలనీకి చెందిన శ్యాంరావ్(65) గత మంగళవారం పశువులను తీసుకుని అడవికి వెళ్లాడు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా లభించలేదన్నారు. పేపర్‌లో వచ్చిన కథనాన్ని పరిశీ లించిన కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి గుర్తించడం జరిగిందని తెలిపారు.

కంటైనర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: జాతీయ రహదారి 44పై దేవాపూర్ చెక్‌పోస్టు శివారు ప్రాంతంలో ఆదివారం కంటైనర్ బోల్తాపడగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కంటైనర్ వాహనం హైదరాబాద్ నుంచి నాగపూర్ వెళ్తుంది. ఇదే క్రమంలో దేవాపూర్ చెక్‌పోస్టు శివారు ప్రాంతంలో కంటైనర్ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవర్ సమీర్‌కు గాయాలు కాగా స్థానికులు చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై మావల పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



నినాదాలు చేస్తున్న కార్మికులు

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ప్రభుత్వం మానుకోవాలని కార్మికులు అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక రిలే నిరాహార దీక్ష ఆదివారం ఆరో రోజుకు చేరింది. కార్యక్రమం లో లక్ష్మి, రాజవ్వ, సుజాత, లతిక, గంగామణి, తదితరులు ఉన్నారు.

క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో ఆదివారం వాసవిక్లబ్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అంతర్జాతీయ పూర్వ గవర్నర్ క్లబ్ సభ్యుడు మనోజ్‌ను వనితాక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జితేందర్, కిషన్, లక్ష్మీనారాయణ, సతీశ్, గంగాధర్, మానస, స్రవంతి, వరలక్ష్మి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దృక్పథం పెంపొందించాలి

భైంసాటౌన్: విద్యార్థుల్లో జాతీయ దృక్పథం పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని అనసూయ పవార్ ట్రస్ట్ చైర్మన్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం ఎస్ఎస్ కాటన్‌లో నిర్వహించిన ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ట్రస్ట్ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ట్రస్మా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఏ ముస్తాక్ మోహియోద్దీన్, గౌరవ అధ్యక్షుడు జాదవ్ పుండలిక్ రావు పాటిల్, అధ్యక్షుడు రఘునాథ్ చారి, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'ఇష్టారాజ్యంగా పంచాయతీ భవన నిర్మాణం'

ఖానాపూర్: మండలంలోని అడవి సారంగాపూర్ గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించే పంచాయతీ భవన నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షించకపోవడంతో ఇష్టారాజ్యంగా చేపడుతున్నారని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. ఆదివారం గ్రామంలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. చర్యలు చేపట్టకుంటే కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఆమ్ ఆద్మీని బలోపేతం చేయండి

నిర్మల్‌రూరల్: ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. మండలంలోని ముజిగి గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉచిత విద్య, వైద్యం గురించి ప్రజలకు వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని ఆదరించాలని కోరారు.

వైద్యసిబ్బంది సర్వే

లక్ష్మణచాంద: నేషన్ ఫ్యామిలీ వెల్ఫేర్ హెల్త్ సర్వేలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది శివకృష్ణగౌడ్, సుగుణ, యాస్మిన్, ఫీల్డ్ ఆఫీసర్లు ప్రవీణ్‌కుమార్, శివకుమార్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కులరహిత సమాజం కోసం ఉద్యమించాలి

కడెం: కులరహిత సమాజం కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కుల నిర్మాణ సదస్సులో మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కులవ్యవస్థ భారతదేశాన్ని పట్టి పీడిస్తుందన్నారు. కుల వ్యవస్థ నిర్మూలనకు అందరం కలిసికట్టుగా పోరాడాలని సూచించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, సునారికారి రాజేశ్, హరిత, వెంకటనారాయణ, గోపి, నర్సయ్య, వెంకటేశ్, వినోద్, కేశవ్, విలాస్, లింగన్న తదితరులు ఉన్నారు.

'అభివృద్ధిని మరిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం'

భైంసారూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని మరిచిపోయిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావుపటేల్ అన్నారు. ఆదివారం పల్లెపల్లెకు బీజేపీ గడపగడపకు మోహన్‌రావు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మాంజ్రి, బాబుల్‌గాం గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉత్సాహంగా శ్రమదానం

- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు
- చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగింపు



భైంసాలో శ్రమదానం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెప్మా సిబ్బంది

భైంసాటౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించి రోగాల వ్యాప్తిని అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో ఆదివారం గంటపాటు స్వచ్ఛత కార్యక్ర మం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రి, బస్టాండ్, తదితర ప్రాంతాల్లో మెప్మా సిబ్బందితో కలిసి చెత్తాచెదారం శుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్, జవాన్ చారి, మెప్మా సిబ్బంది దత్తు, తదితరులు పాల్గొన్నారు.

తానూరు: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వీధులను శుభ్రం చేశారు. సర్పంచ్ శివరాత్రి ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉత్తం బాలేరావ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో వినాయక్ మాట్లాడారు. పరిశుభ్రతలో అందరూ భాగస్వాములై రోగాల వ్యాప్తిని అరికట్టాలని కోరారు. అనంతరం కార్యక్రమంపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు, సిబ్బంది సుధాకర్, సాంబయ్య తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో వీధుల శుభ్రత, పాఠశాలలు, వైద్యశాల వద్ద పరిశుభ్రతపై పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. గాంధీ జయంతి సందర్భంగా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యదర్శి గాయిత్రి, ఈశ్వర్, రాంకుమార్, గణేశ్ ఉన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంతో పాటు ధర్మోర, పంచగుడి, వట్టోలి, పుస్పూర్, జోహర్‌పూర్ గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్వయం సహాయక బృందం సభ్యులు పాఠశాలలో గదులను శుభ్రం చేసి రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోలమాన్ రాజ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



లోకేశ్వరం: జోహర్‌పూర్‌లో ఊడుస్తున్న సభ్యులు



తానూరు: భోసిలో ఊడుస్తున్న నాయకులు

నర్సాపూర్(జి): స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని నర్సాపూర్(జి), రాంపూర్, టెంబుర్ని, గొల్లమాడ గ్రామాల్లో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు రాంరెడ్డి, చెన్న మహేశ్, సిరిపెల్లి దత్తు, కార్యదర్శులు నవనీత్ కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఎల్‌పీవో శివకృష్ణ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం కుంటాలలో పంచాయతీ, వైకుంఠధామం,సెగ్రిగేషన్ షెడ్డుల్లో పిచ్చి మొక్కలను తొలగించి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సమత, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎస్సై హన్మాండ్లు, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, ఏపీఎం అశోక్, కార్యదర్శి రాజాబాపు తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని భూత్కూర్, ఎర్రగుంట, దేవునిగూడెం, గొడిసీర్యాల(జి), మల్లాపూర్, బుట్టాపూర్, ఆకొండపేట, మున్యాల, దస్తురాబాద్ పంచాయతీల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్‌లు రాజమణి, పోసవ్వ, అంజన్న, లక్ష్మి, భూమేశ్, నిరోష, ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి, కార్యదర్శులు సత్యనారాయణ, రామకృష్ణ, నారాయణ, శ్రీనివాస్, రవీందర్, ఏపీవో రవిప్రసాద్, పాల్గొన్నారు.



నర్సాపూర్(జి): రాంపూర్ పాఠశాలలో ..



భైంసారూరల్: వానల్‌పాడ్‌లో..



ఖానాపూర్: ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో ఎంపీడీవో శేఖర్ పర్యటించి కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. ఎంపీవో నసీరుద్దిన్, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద దీక్ష కళాశాల విద్యార్థులు..

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఆదివారం దీక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు బస్టాండ్ పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈనెల 2న నిర్వహించే ముదిరాజ్ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని జిల్లా ముదిరాజ్ కోర్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా కోర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

నేడు రక్తదాన శిబిరం

భైంసాటౌన్: భైంసా గాంధీగంజ్ మార్కెట్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో సోమవారం భారీఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో యువకులు, ఇతరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అలాగే అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

నేడు మంత్రి రాక

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాంలో నిర్మించిన గోదాంను సోమవారం ఉదయం 11 గంటలకు మంత్రి ఐకేరెడ్డి ప్రారంభిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు క్రిష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

రూ.18వేలు పలికిన లడ్డూ

కుంటాల: వినాయక నిమజ్జోత్సవాల సందర్భంగా కుంటాల యువ యూత్ గణేశ్ మండలి వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించారు. గ్రామానికే చెందిన వంశీ రూ.18,500లకు దక్కించుకున్నారు. అనంతరం మండలి సభ్యులు ఆయనను సన్మానించారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ఖానాపూర్‌లో నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు



ముధోల్‌లో మద్దతు తెలుపుతున్న బీఎస్పీ నేతలు

లక్ష్మణచాంద: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఆశవర్కర్లు ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం మండలాధ్యక్షురాలు విజయ, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, కోశాధికారి శారద, సభ్యులు సుమలత, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గంగామణి, కమల, స్వాతి, పద్మ, మమత, సంధ్య తదితరులు ఉన్నారు.

కడెం: ఆశవర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు జాదవ్ రాంకిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న ఆశవర్కర్లకు ఆదివారం ఆయన మద్దతు తెలిపారు.

ముధోల్: తమ సమస్యల పరిష్కారానికి ఆశవర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆదివారం బీఎస్పీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. బీఎస్పీ నాయకులు గౌతమ్ వాగ్మారే, సిద్ధార్థ్ సూర్యవంశీ, ఆనంద్ మాస్కేవార్ తదితరులు ఉన్నారు.

'గౌడగర్జన జయప్రదం చేయండి'

ఖానాపూర్: గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ నర్సాగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాలులో ఈనెల 3న నిర్వహించే గౌడగర్జనకు గౌడ కులస్తులు తరలిరావాలని కోరారు. కుల దామాషా ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసేందుకు గౌడ కులస్తులకు అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాములు గౌడ్, రాజేందర్ గౌడ్, శంకర్ గౌడ్, మల్లేష్ గౌడ్, వెంకాగౌడ్, రాజారాంగౌడ్, భూమా గౌడ్ ఉన్నారు.

కడెం: జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వేషన్ హాలులో మంగళవారం నిర్వహించే మోకుదెబ్బ గౌడగర్జన మహాసభలను జయప్రదం చేయాలని అమరవేణి నర్సాగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో గౌడ సంఘం నాయకులతో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మోకు దెబ్బ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, గీత కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.



కడెంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని గౌడ సంఘ భవనంలో మోకుదెబ్బ గౌడగర్జన మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండలాధ్యక్షుడు గుడిసెల శంకర్‌గౌడ్, నాయకులు రమేశ్‌గౌడ్, ముత్తగౌడ్, భూమాగౌడ్, సాయాగౌడ్ తదితరులున్నారు.

కుంటాల: జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాలులో నిర్వహించే మోకుదెబ్బ గౌడ జనగర్జన రాష్ట్ర సభలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శరత్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని కల్లూర్‌లో ఆదివారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండి రమణాగౌడ్, మండల కన్వీనర్ సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'పెరిక సంఘం బలోపేతానికి కృషి చేయండి '

దస్తురాబాద్: పెరిక సంఘం బలోపేతానికి సంఘ సభ్యులు కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చుంచు భూమన్న సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల పెరక సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఇటీవల ఎన్నికైన పెరిక మండల, గ్రామ కమిటీల సభ్యులను ఘనంగా సన్మనించారు. కార్యక్రమంలో ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల అధ్యక్షులు ముక్కెర శ్రీను, రాజమౌళి, లసెట్టి శ్రీను, గోపు రవి, లసెట్టి శేఖర్, దాసరి సుధాకర్, చక్రపాణి, అప్పని భూమన్న, గోపు భూమన్న, మెడిశెట్టి లక్ష్మణ్, మహేశ్, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో నాయకులు

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం తిరస్కరణపై నిరసన

ఖానాపూర్: ఎమ్మెల్సీగా కుర్రు సత్యనారాయణ అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తమిళిసై తిరస్కరించడంపై ఆదివారం ఖానాపూర్‌లో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వెనుకబడిన గిరిజన తెగకు అవకాశం కల్పించే విషయమై గవర్నర్ పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని జూని కుమార్, గర్క గంగన్న, జెట్టి శ్రీనివాస్, చిన్నయ్య, జెట్టి రాజేశ్వర్, కాండ్లి రాము తదితరులు ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎరుకల కులస్తులు

ప్రధాని సభను విజయవంతం చేయండి

ముధోల్: నిజామాబాద్‌లో ఈనెల 3న నిర్వహించే ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావుపాటిల్ అన్నారు. ఆదివారం ముధోల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో జనాన్ని తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ సుమన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిపాండే, నారాయణ్‌రెడ్డి, సుభాష్‌పటేల్, ఎంపీటీసీ భూమేష్, మండలాధ్యక్షుడు పోతన్న, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: ప్రధాని సభకు బీజేపీ కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి అర్మోల్ల పోశం అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మి కల్యాణ మండపంలో బీజేపీ కార్యకర్తలతో మాట్లాడారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణ్‌రెడ్డి, రవి పాండే, అలివేలు మంగ, సుమన్‌కుమార్, మండలాధ్యక్షుడు గంగాధర్ ఉన్నారు.



కుంటాల: అంబకంటిలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కుంటాల: ప్రధాని మోదీ పాల్గొనే సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. మండలంలోని అంబకంటిలో మాట్లాడారు. రాష్ట్రంలో పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ గజ్జారాం యాదవ్, ఆదుముల పోశం, రవి పాండే, సుమన్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. అయ్యన్న గారి భూమయ్య, మండలాధ్యక్షుడు అర్జున్ ఠాకూర్, నరేందర్ పాల్గొన్నారు.

న్యాయం కోసం ఆందోళన

లక్ష్మణచాంద: భూతగాదాలతో కుటుంబసభ్యుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తి మరణించగా తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు ఆదివారం ఆందోళనకు దిగారు. రెండు రోజుల కిందట మండలంలోని మల్లాపూర్‌లో అన్నదమ్ముల మధ్య గొడవ జరగగా సిలారి చిన్న మల్లయ్య(45) తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం గ్రామంలో అతడి బంధువులు ఆందోళన చేపట్టగా.. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

ఉత్తమ రైతుకు సన్మానం

నిర్మల్‌రూరల్: నిజామాబాద్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలో ఉత్తమ రైతులను ఎంపిక చేసి వారిని సన్మానించారు. జిల్లా నుంచి సోన్ మండలం సిద్దిలకుంటకు చెందిన సురకంటి మధుసూదన్ రెడ్డి అనే రైతు ఎంపికవగా శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఈసందర్భంగా తాము సాగు చేసే నూతన పద్ధతులు వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటల రకాలను వివరించారు. ఇందులో జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నల్ల పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాన్సన్‌నాయక్‌కు సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని ఆటోట్రాలీ లోకల్ యూనియన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో జాన్సన్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు.

బాసరలో శ్రమదానం

భైంసా: వినాయక నిమజ్జనం నేపథ్యంలో బాసరలో గోదావరి వంతెనపై శ్రమదానం చేశారు. పూజ సామగ్రి, వ్యర్థాలను ఆదివారం విజన్ యూత్ సభ్యులు తొలగించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

లక్ష్మణచాంద: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి, పద్మ, సునీత, సుజాత, విజయ, గంగామణి పాల్గొన్నారు.

ముధోల్: ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది ముధోల్‌లో రాస్తారోకో నిర్వహించారు. గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై అంగన్‌వాడీ సిబ్బంది ఆదివారం రాస్తారోకో చేపట్టారు. పోలీసులు వెళ్లి వారితో ఆందోళన విరమింపజేశారు. ప్రభుత్వం వెంటనే తమను చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు.



ముధోల్‌లో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఖానాపూర్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ముగ్గురు బాలురు విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలిసిందే. ఆదివారం పలువురు దాతలు బాధిత కుటుంబాలకు తమ వంతు ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని సింగాపూర్‌కు చెందిన ఎన్ఆర్ఐ పన్నెల జనార్దన్ రూ.10వేలు, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ రూ.ఐదు వేలు, మాజీ ఎంపీటీసీ గంగారావు రూ.1500, కౌన్సిలర్ తొంటి శ్రీనివాస్ రూ.మూడు వేలు, కొత్తపెల్లి సురేశ్ రూ.2వేలు, శాంతినగర్ ఓంకారేశ్వర యూత్ రూ.1500, బి.లక్ష్మణ్ రూ.1500, సుమన్, కిషోర్, సంతోష్, జితేందర్, బుచ్చన్న రూ.వెయ్యి చొప్పున ఆర్థికసాయం అందించారు.

కుంటాలలో ఉద్రిక్తత..

కుంటాల: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఇద్దరిపై దాడి చేయడం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. దీంతో పోలీసులు వచ్చి నలుగురిని అదుపులోకి తీసుకొని తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే కుంటాలకు చెందిన దోనిగామ గంగాధర్ ఆయన కుమారుడు అన్వేష్.. ఇదే మండలంలోని సూర్యపూర్‌కు చెందిన బక్కి గణేశ్‌పై మండల కేంద్రంలోని గజ్జలమ్మ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఎదుట ఉన్న కిరాణ దుకాణం వద్ద దాడి చేశారు. వెంటనే గణేశ్ తన స్నేహితులకు ఫోన్ చేయడంతో వారు అక్కడకు వచ్చారు. గణేశ్ స్నేహితుడైన భైంసాకు చెందిన శ్రీకాంత్‌పై మళ్లీ గంగాధర్‌తో పాటు ఆయన ముగ్గురు కుమారులు దాడి చేశారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు.

ఈ ఘటనలో శ్రీకాంత్ తీవ్రంగా గాయపడగా భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. భైంసా గ్రామీణ సీఐ నైలు, కుంటాల ఎస్సై హన్మాండ్లు , కుభీర్ ఎస్సై షరీఫ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కబెట్టారు. గంగాధర్‌తో పాటు ముగ్గురి కుమారులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు వెల్లడించారు.



ఘటన వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కేటీఆర్ పర్యటనకు ఏర్పాట్లు

నిర్మల్‌టౌన్: జిల్లాకు ఈనెల 4న మంత్రి కేటీఆర్ రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆదివారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో ఖాళీ స్థలాన్ని పార్కింగ్ కోసం పరిశీలించారు. స్థానిక బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూం కార్నర్‌లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న దష్ట్యా పలు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాలతో సభ ప్రాంగణం, పార్కింగ్ తదితర పనులను పకడ్బందీగా చేపట్టినట్టు తెలిపారు. వారి వెంట ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు. అనంతరం కొండాపూర్ బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమై పలు అంశాలు చర్చించారు.



పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్